## జర్నలిస్టుల ఇండ్ల స్థలం కబ్జాకు యత్నం



జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఫెన్సింగ్ కూల్చివేసిన కబ్జాదారులు

కొండాపూర్ : జర్నలిస్టుల ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన భూమిని కబ్జా చేసేందుకు కబ్జాదారులు యత్నించారు. చందానగర్‌లోని సదరు స్థలంలో ఫెన్సింగ్ తొలగించారు. విద్యుత్‌లైన్ ఏర్పాటు కోసం అధికారులు స్తంభాల నిర్మాణ పనులు చేపట్టసాగారు. దాంతో జర్నలిస్టులు పనులను అడ్డుకొన్నారు. మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. మండలపరిధిలోని జర్నలిస్టుల కోసం ప్రభుత్వం చందానగర్‌లోని సర్వే నం.174లో ఎకరాను కేటాయించింది. రెవెన్యూ అధికారులు హద్దు లు నిర్ణయించిన స్థలం చుట్టూ జర్నలిస్టులు హద్దురాళ్లు ఏర్పాటు చేసి రక్షణ కోసం ఫెన్సింగ్ వేశారు. సోమవారం కొందరు ఫెన్సింగ్ కూల్చివేసి పక్కనే ఉన్న ప్రైవేట్ స్థలంలో ఉన్న విద్యుత్‌లైన్‌ను మార్చారు. ఇండ్లస్థలం మధ్యలో నుంచి స్తంభాలు ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టారు. మంగళవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా.. స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేశారు. విద్యుత్ అధికారుల తీరుపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కస్థలంలో ఉన్న విద్యుత్‌లైన్‌ను మార్చి తమస్థలంలో స్తంభాలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని ఏడీఈని ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన డిప్యూటీ కమిషనర్ ఫెన్సింగ్ కూల్చివేసిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చందానగర్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ల నాయకులు, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజలు



కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ సీనియర్ సిటిజన్స్ భవనంలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు

దుండిగల్, జూన్ 3 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ , మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ రాజు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గానికి చెందిన పలువురు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కరించాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పలు ప్రాంతాల్లో జరగబోయే శుభకార్యక్రమాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

### సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటా..

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 3 : కేపీహెచ్‌బీ కాలనీలోని సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ సీనియర్ సిటిజన్స్ భవనంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు సీనియర్ సిటిజన్స్‌తో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ సౌకర్యార్థం అదనపు గదిని నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ రంజిత్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన వికారాబాద్ జిల్లా బాడ్మింటన్ పోటీలు



కొండాపూర్, జూన్ 3 : కొండాపూర్‌లోని ఏ జోన్ బాడ్మింటన్ అకాడమీలో వికారాబాద్ జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. బీఏవీడి జిల్లా అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి యు.వి.ఎన్. బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్ విజేతలకు పి.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. టోర్నమెంట్లో వివిధ ప్రాంతాలకు చెందిన 265 మంది క్రీడాకారులు పాల్గొన్నారు సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మరిన్ని పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### హెచ్‌సీయూకు.. యూఎస్‌డబ్ల్యూ యూనివర్సిటీ ప్రతినిధులు

కొండాపూర్ : విద్య, పరిశోధనలో భాగస్వామ్యం పెంపొందించే దిశగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కృషి చేస్తుందని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ. బీజే రావు అన్నారు. విద్య, పరిశోధనల అభివృద్ధికి పరస్పర సహకారం కోసం హెచ్‌సీయూ, యూకేలోని యునైటెడ్ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయం ( యూఎస్ డబ్ల్యూ)తో అవగాహన ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. వర్సిటీని సందర్శించిన బృందానికి ఆరోగ్య సంరక్షణ నిర్వహణ, సిబ్బంది మార్పిడి, విద్యార్థి ప్రాజెక్టులు, ఉమ్మడి పాఠ్యాంశాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీస్ ఫర్ ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొ. బ్రహ్మానాదం, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొ. జి.వి.ఆర్.కె. ఆచార్యులు, స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్ డాక్టర్ రమేష్‌కుమార్ మిశ్రా, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీస్ అధికారులు, యూఎస్‌డబ్ల్యూ ప్రతినిధులు పాల్గొన్నారు.



యూఎస్‌డబ్ల్యూ ప్రతినిధులతో హెచ్‌సీయూ వీసీ బీజే రావు

## మహాత్మాగాంధీకి నివాళి



కేపీహెచ్‌బీ కాలనీ : అమెరికా డల్లాస్ నగరంలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా మహాత్మాగాంధీ మెమోరియల్ పార్కులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తన్నీరు మహేశ్‌తో వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావు, నాయకులు మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.



### ఘనంగా హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

మూసాపేట : మూసాపేట డివిజన్ జనతా నగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు కిలారు శేషు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరై పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, తుకారాం, మల్లేశ్, రాజు, అనంత్‌గౌడ్, జైరాజ్, నరేశ్, వినోద్, కృష్ణ, కుమార్, సత్త య్య, అక్షయ్, సాయి, సిద్దు, లక్కి పాల్గొన్నారు.



వెంకటపాపయ్య నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో రామగిరి నాగేశ్వర రావు, మరల పల్లి, శ్రీనివాస్, కాసులవాడి ప్రభాకర్ రావు, కే నాగరాజు ముదిరాజ్, నిరంజన్ రెడ్డి, సత్యం రావు, వేలూరు రవికుమార్, పవన్ రావు, శర్వాన్ రాయుడు పాల్గొన్నారు.
- కేపీహెచ్‌బీ కాలనీ

## ఎవరెస్టు అధిరోహించడం అభినందనీయం



బాలానగర్, జూన్ 3 : బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడకు చెందిన పడకంటి విశ్వనాథ్ కార్తికేయ పిన్నవయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం అభినందనీయమని బాలానగర్ మాజీ కార్పొరేటర్ కాండూరి నరేందర్ ఆచార్య అన్నారు. మంగళవారం కార్తికేయ నివాసానికి వెళ్లి శాలువా, పూలమాలతో సన్మానించారు. దేశంలోనే పిన్న వయసులో ఘనత సాధించడం శుభ పరిణామం అన్నారు. ప్రపంచస్థాయిలో రెండోస్థానంలో నిలిచిన కార్తికేయను ఆయన ప్రశంసించారు.



ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్

## ప్రజా సంక్షేమానికి కృషి

బాలానగర్ : ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ అన్నారు. మంగళవారం దుబాయ్ గేట్ వైష్ణవ మాత ఆలయం ఎదురు ప్రాంతాల్లో పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ స్తం భాల ఏర్పాటు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి స్థానికులు తీసుకోవచ్చారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారన్నారు. పలుమార్లు చెప్పినా మార్పు రావడంలేదని అసహనం వ్యక్తం చేశారు. వారి దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ఆశ, జలమండలి మేనేజర్ తేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, లక్ష్మణ్ యాదవ్, నవీన్ రెడ్డి, బస్తీవాసులు దామోదర్ వర్మ, అశోక్, వెంకటయ్య పాల్గొన్నారు.

## ఎఫ్‌టీఎల్ స్థలాన్ని సందర్శించిన హైడ్రా అధికారులు



బఫర్ జోన్ స్థలాలను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

కుత్బుల్లాపూర్, జూన్ 3 : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గుండ్లపోచంపల్లి శివారు ప్రాంతంలో లింగయ్య చెరువుకు ఆనుకొని ఉన్న బఫర్ జోన్‌లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను మంగళవారం హైడ్రా అధికారులు సందర్శించారు. సోమవారం ప్రజావాణిలో వెలువడిన పలు ఫిర్యాదుల మేరకు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు పరిశీలించారు. అనంతరం ఎఫ్‌టీఎల్‌కు దూరంలో నిర్మాణాలు జరుగుతున్నాయని, చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హైడ్రా అధికారులు, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

దుండిగల్ : గంజాయి మత్తులో యువకులు స్వైరవిహారం చేశారు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు .. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, దుండిగల్‌లోని డబుల్ బెడ్ రూమ్‌ల గృహ సముదాయంలో సో మవారం రాత్రి ఓ యువకుడు 29వ బ్లాక్ వద్ద సిగరెట్ తాగుతూ ఉండగా వివాదం నెలకొన్నది. దీంతో ఇద్దరు యువకులు కర్రలతో పరస్పరం దాడులకు దిగడంతో భయానక వాతావర ణం నెలకొన్నది. ఈ ఘటనలో ఓ యువకుడు గాయపడడంతో రక్తస్రావం అ యింది. గంజాయి మత్తులోనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వీటిని నివారించాల్సిన అవసరం ఉందంటున్నారు. సోమవారం రాత్రి ఘటన జరగగా, మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలుడు దుర్మరణం



దుండిగల్ : బర్రెతోక పట్టుకొని చెరువులోకి వెళ్లిన బాలుడు మృత్యువాత పడిన ఘటన దుండిగల్ పీఎస్ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భౌరంపేట్‌కు చెందిన సుక్కయ్య, నీరజ దంపతులు. వీరికి విష్ణుయాదవ్ (16) తో పాటు కూతురు ఉన్నది. దంపతులు బర్రెలను సాకుతూ, పాలను అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం బర్రెల కాపరిగా వెళ్లిన విష్ణుయాదవ్ నార్లకుంట చెరువు వద్ద మేపుతున్న క్రమంలో బర్రెలు చెరువులోకి వెళ్లగా వాటికి బయటికి తెచ్చేందుకు ఓ బర్రె తోక పట్టుకొని చెరువులోకి వెళ్లాడు. నీట మునిగి ఊపిరి ఆడక అక్కడిక్కడే మృత్యువాత పడ్డాడు. దీంతో సుక్కయ్య, నీరజ కుటుంబంలో విషాదం నెలకొన్నది. బాలుడు శిఖర స్కూల్‌లో 9వ తరగతి చదవాల్సి ఉండగా.. అతడి చెల్లెలు 8 వ తరగతికి వెళ్తున్నది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పేదల ఆరోగ్యమంటే.. ఇంత అలుసా..?



100 పడకల వైద్యశాల నిర్మాణ పనులు చేపట్టాలని నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 3 : పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో.. 100 పడకల ప్రభుత్వ వైద్యశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి.. రెండేండ్లు గడుసున్నా.. నిర్మాణ పనులు చేపట్టలేదని, పేదల ఆరోగ్యం అంటే ప్రభుత్వానికి ఇంత అలుసా.. ? అని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ప్రశ్నించారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లో 100 పడకల వైద్యశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్థలంలో శ్రీనివాసరావు బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 1.17 ఎకరాల్లో రూ. 36 కోట్ల వ్యయంతో ప్రభుత్వ వైద్యశాల నిర్మించేందుకు నాటి మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడుస్తున్న పనులు ప్రారంభం కాకపోవడంపై కార్పొరేటర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఫౌండేషన్ రాయిని కూల్చారే తప్ప.. నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం కోసం అల్లాడుతుంటే.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు కాలనీలో ఎన్టీఆర్ పేరుతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం తాను కోటి రూపాయలు విరాళంగా ప్రకటించి.. ఆనాటి కలెక్టర్ అనుమతులతో పనులు ప్రారంభించామని, పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని హౌసింగ్ బోర్డు నుంచి స్వాధీనం చేసుకొని పనులకు సహకరించాలని కలెక్టర్‌కు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల కోసం వైద్యశాల, ఉచితవిద్య కోసం పాఠశాలను నిర్మించడానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనగాం సురేశ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, భవాని, భారతి, కన్నాలత, రమాదేవి పాల్గొన్నారు.

## నాణ్యత పాటించాలి

జగద్గిరిగుట్ట జూన్ 3 : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ విజయశేఖర్ గౌడ్ సూచించారు. రంగారెడ్డి నగర్ డివిజన్‌లో పలుచోట్ల నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికులతో మాట్లాడి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. డీఈ సాగర్, ఏఈ స్వాతి, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు



## ముగిసిన ఎన్‌సీసీ వార్షిక క్యాడెట్ శిక్షణ శిబిరం



శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో ఎన్‌సీసీ క్యాడెట్ వార్షిక శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగింది. హైదరాబాద్ నగర ఎన్‌సీసీ ఆర్టిలరీ గ్రూప్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గత నెల 26 నుంచి పది రోజులుగా శిబిరం నిర్వహించబడుతుంది. 600 మంది క్యాడెట్ విద్యార్థులు క్యాంప్ శిక్షణ శిబిర కమాండెంట్ కల్నల్ రవీంద్రరావు పర్యవేక్షణలో పదిమంది ఆర్మీ అసోసియేట్ అధికారుల బృందం శిక్షణ ఇచ్చా రు. బుధవారం ముగియనున్న శిబిరంలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, పద్మశ్రీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణలో తర్ఫీదు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేయనున్నారు. మేడ్చల్ సంస్కార్ ఇనోవేటివ్ నుంచి వచ్చిన ఎన్‌సీసీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. స్కూల్ టీఏ నరేంద్రబాబుని తల్లిదండ్రులు అభినందించారు.

## జువైనల్ హోంకు బాల నేరస్తులు

మాదాపూర్ : ఇద్దరు బాల నేరస్తులను జువైనల్ హోంకు తరలించారు. ఈ ఘటన మంగళవారం మియాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై రమేశ్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్లోని హుడా కాలనీకి చెందిన ఇద్దరు బాలలు (15, 16) సాయి గణేశ్ తో కలిసి కొన్నేండ్లుగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. ద్విచక్రవాహనం, సెంట్రింగ్ సామగ్రి దొంగిలిస్తున్నారు. వారిపై గతంలో వీరిపై కూకట్‌పల్లి, గచ్చిబౌలి పీఎస్‌లలో కేసులు నమోదైయ్యాయి. ఆటో దొంగతనం చందానగర్ పీఎస్‌లో కేసు నమోదు కాగా.. రోడ్డుపై వెళ్తున్న ఓ మహిళ మొబైల్ లాక్కొని అసభ్యకరంగా ప్రవర్తించారు. ఇది రాయదుర్గం పీఎస్‌లో నమోదయింది. మియాపూర్ పీఎస్‌పరిధిలో మూడు చోట్ల ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ఏడు కేసులు ఉండగా.. మియాపూర్ పీఎస్ పరిధిలోని హఫీజ్‌పేట్ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని రవికిరణ్ ఇంట్లో గత నెల 25న అర్ధరాత్రి సాయిగణేశ్, ఇద్దరు మైనర్ బాలుర్లతో కలిసి దొంగతనానికి యత్నించారు. యజమాని రవికిరణ్ నిద్రలో నుంచి లేవగా దొంగలు పరారయ్యారు. గత నెల 26న పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలు పరిశీలించగా నిందితులను గుర్తించి మైనర్లను ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనాలకు అంగీకరించారు. సాయి గణేశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. బాల నేరస్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఆటోను స్వాధీనం చేసుకుని జువైనల్ హోం కు తరలించారు.

**తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన సమక్షంలో హైదరాబాద్ వద్ద**
**A.S.No.33 ఆఫ్ 2025**
**దిగువ వారి మధ్య:**
మెసర్స్ సానో కాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ...అప్పీలుదారు
మరియు
ఎన్.సాంబశివ రావు తండ్రి వెంకటేశ్వర్ రావు ...ప్రతివాది
దిగువ తెలిపిన వారికి,
ఎన్.సాంబశివ రావు, తండ్రి: వెంకటేశ్వర్ రావు, వయస్సు: సుమారు 70 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, O/o. S-5 టెక్నోక్రాట్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఫేజ్ II, బాలానగర్, హైదరాబాద్-500037.
IV అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్, సంగారెడ్డి సమక్షంలో OS.No. 13 ఆఫ్ 2003లో 27.03.2024 తేదీనాటి తీర్పు మరియు డిక్రీకి వ్యతిరేకంగా పైన తెలిపిన మొదటి అపీలు దాఖలు చేయబడినది. సదరు మొదటి అప్పీలు 19.06.2025కు వాయిదా వేయబడినది. సదరు తేదీన కౌన్సిల్ ద్వారా లేదా స్వయంగా హాజరు కావలసిందిగా మీకు తెలియజేయడమైనది, సదరు గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం సమక్షంలో హాజరగుటలో విఫలమైనచో సదరు కేసు మీ పరోక్షంలో విచారించబడి నిర్ణయించబడుతుంది.
**సం/- ఆర్.వినోద్ రెడ్డి, అడ్వకేట్**
ఇం.నెం.8-2-684/4/31, రోడ్ నెం.12, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.